

నగరంలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలకు వివిధ దేశాలను నుండి వస్తున్న సుందరీమణులకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న దృశ్యం



హైదరాబాద్ వార్త

# పేద ప్రజల గుండెచప్పుడు..నిమ్స్ ఆసుపత్రి

- కొందరు అవినీతి అధికారుల కారణంగా తరచూ విష ప్రచారం
- లేఖల రూపంలో ఉన్నతాధికారుల దృష్టికి నిమ్స్ భాగోతం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- నిజానిజాల నివేదిక తయారీలో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- పూర్తిస్థాయి నివేదికను త్వరలో ముఖ్యమంత్రికి సమర్పించనున్న అధికారులు



**పంజగుట్ట, మే 8 (ప్రభాతవార్త):**
ప్రతిష్టాత్మక నిమ్స్‌లో అంతర్గత కుమ్ములాటలపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిపెట్టినట్లు సమాచారం. గత కొంత కాలంగా నిమ్స్‌పై లోపలి వారే బయటవారితో కలసి విషం చిమ్ముతున్న విషయాలపై ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు ఆరా తీసినట్లు విశ్వసనీయసమాచారం. ఆకాశరామన్న లేఖల పేరుతో అటు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఇటు ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు తరచూ వస్తున్న లేఖలపై కూడా నిజానిజాలు తెలుసుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేశారని తెలిసింది. దీనిలో భాగంగా గత వారం రోజులుగా కొందరు ఆరోగ్య శాఖకు సంబంధించిన వేగులు అంతర్గతంగా అసలు నిమ్స్‌లో ఏం జరుగుతుందనే విషయంలో పూర్తి సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. తరచూ వస్తున్న ఆరోపణలపై ముఖ్యమంత్రి కార్యాలయం ఏ క్షణంలోనైనా నివేదిక కోరే అవకాశం ఉండడంతో అధికార యంత్రాంగం ముందుగానే నిజానిజాలు తెలుసుకుని పూర్తిస్థాయి నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమైపోయినట్లు తెలిసింది. అదేవిధంగా కొందరు నిష్ణాతులైన వైద్యులు నిమ్స్‌ను వీడాలనే ఆలోచన చేయగా డైరక్టర్ వారికి వాస్తవ పరిస్థితులను వివరించి..నిమ్స్‌లోనే సేవచేసే విధంగా వారిని ఒప్పించిన విషయాలు కూడా ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం.

నిమ్స్ డైరక్టర్‌గా నగరి బీరప్ప ఆసుపత్రికి సారధ్యం వహిస్తున్నారు. ఆయనలో సేవాతత్పరతతో పాటు పని చేయాలనే తపన తప్ప మిగతా విషయాల గురించి అతను పెద్దగా పట్టించుకోడు. పనిచేసే వారు ఎవరైనా ఆయన ఎంకరేజ్ చేస్తాడు. గ్రూపులు, రాజకీయాలు వీటన్నింటికీ అతీతంగా ఆయన తనపని తాను చేసుకుపోతుంటాడు. ఏ పని చేసినా రోగుల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. ఇక్కడే కొంత మంది అధికారులకు కడుపుమంట స్టార్ట్ అయింది. దశాబ్దాల తరబడి ఆసుపత్రిలో పాతుకుపోయిన ఈ సోకాల్డ్ పెద్దలు తాము చేసిందే శాసనం, తాము చెప్పిందే జరగాలనే మంకు పట్టుదలతో కేవలం ధనార్జనే ధ్యేయంగా వీరి కార్యకలాపాలు దశాబ్దాలుగా జరుగుతున్నాయి. నిమ్స్ ఆసుపత్రి నిర్వహణకు రకరకాల కాంట్రాక్టర్‌లు ఇక్కడ సరఫరా చేస్తుంటారు. వీటిలో ప్రధానమైనవి మందులు. ఈ మందులను నిమ్స్‌కు సరఫరా చేసే కాంట్రాక్టర్‌లు పదుల సంఖ్యలో ఉంటారు. వీరు ఎప్పటి నుంచో ఈ ఆసుపత్రికి మందులు సరఫరా చేస్తూ కొందరు అధికారులను లోబరుచుకుని ఇష్టమొచ్చినట్లు కోట్ చేస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటూ అవినీతి అధికారులకు ఒక రకంగా భిక్షమేస్తూ వారి పబ్బం గడుపుకుంటున్నారు. మందులు ఆసుపత్రికి వచ్చిన తర్వాత వాటి నాణ్యత విషయంలో పర్యవేక్షణకు ఒక ప్రత్యేక విభాగం ఉంటుంది. అక్కడ పనిచేసేవారు కూడా కాంట్రాక్టర్‌ను బట్టి చూసీచూడనట్లు వదిలేస్తుంటారని అక్కడ పనిచేసే ఉద్యోగులే బాహాటంగా చెబుతుంటారు. కారణం ఈ కాంట్రాక్టర్ ఫలానా సార్ మనిషి అంటూ కూడా చెబుతుంటారు. అదేవిధంగా నిమ్స్‌లో రెండు మెడికల్ షాప్‌లు ఉన్నాయి. అక్కడ కూడా పరిధికి మించి రేట్లు పెట్టి రోగులనుండి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. మరి కొందరైతే నిమ్స్ బయట ఉన్న మెడికల్ షాప్‌ల వారితో ఒప్పందాలు చేసుకుని ఈ మందులు ఫలానా షాప్‌లో మాత్రమే తీసుకోవాలంటూ అక్కడకు పంపుతూ ఉంటారు. ప్రతిరోజూ నిమ్స్‌కు వేలాదిగా రోగులు, వారి సంబంధీకులు రాకపోకలు సాగిస్తుంటారు. వారు తమతమ వాహనాలను తప్పనిసరిగా నిమ్స్ పార్కింగ్‌లోనే పార్క్ చేయాల్సి ఉంటుంది. ఇక్కడ పార్క్ చేసిన వెంటనే పార్కింగ్ కాంట్రాక్టర్ మనుషులు వచ్చి వాలిపోతారు. ఐదు నిమిషాలు ఇక్కడ కారు ఆపినా వారికి కప్పం కట్టాల్సిందే. రేట్లు చూస్తే కళ్ళు బైర్లు కమ్ముతాయి. కారుకు 80 రూపాయలు అరగంట ఉన్నాసరే చెల్లించాలంటే రోగుల బంధువులు భీతిల్లిపోతున్నారు. ఈ కాంట్రాక్టర్‌కు కూడా ఓ ప్రధాన అధికారి సహాయ సహకారాలు మెండుగా ఉన్నాయనే విషయం ఇక్కడ భహిరంగ రహస్యమే. ఇక ఆరోగ్యశ్రీ రోగులకు డైట్ సరఫరా చేయాల్సిన లోపలి క్యాంటీన్ వారు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నా వారిని అడిగే నాధుడే కరువయ్యాడు. నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేసే రోగుల ఆరోగ్యాలను కాపాడాల్సిన డైట్ నిర్వాహకులు ఇక్కడ ఓ దాబా తరహాలో పూర్తిస్థాయిలో రోగుల ఆరోగ్యాలకు సహకరించని ఫుడ్‌ను సరఫరా చేస్తున్నారని ఓ రోగి బంధువు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక రేట్లు పెట్టి బయటి వారికి ఎలా అమ్ముకున్నా ఫర్వాలేదు కానీ ఆరోగ్య శ్రీ రోగులకు వీరు సరఫరా చేసే ఫుడ్ క్వాలిటీ విషయంలోనూ క్వాంటిటీ విషయంలోనూ అధ్వాన్నంగా ఉందని గతవారం ఓ రోగి బంధువు సిబ్బందిని నిలదీయగా నీ ఇష్టంవచ్చింది చేసుకో అంటూ దురుసుగా సమాధానం ఇచ్చినట్లు ఆయన వాపోయారు. ఈ మధ్యనే క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఈ క్యాంటీన్‌ను చెక్‌చేసి గుడ్ అంటూ సర్టిఫికేట్ కూడా ఇచ్చారు. అయితే తనిఖీ ఉంటుందని వీరికి రెండు రోజుల ముందుగానే నిమ్స్ సిబ్బంది వీరికి ఉప్పందించడంతో ఆ రెండు రోజులు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించి తర్వాత యధారాజా తథా ప్రజలాగా మారిపోయారని నిమ్స్‌కిందిస్థాయి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా ఇక్కడ విచ్చలవిడి తనం, అవినీతి రాజ్యమేలుతుంటుంది. వీటన్నింటికి కారణం ఇక్కడ పాతుకుపోయిన పెద్ద మనుషులు. ఈ కాంట్రాక్టర్‌లు ఏం చేసినా వీరిని కనీసం అడిగే హక్కు కూడా ఎవరికీ ఉండదు. నిమ్స్‌లో పనిచేసే బడా ఉద్యోగులే వీరికి సలామ్ చేస్తుండడంతో వీరు చెప్పిన రేటుకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి రోగులకు, వారి బంధువులకు ఏర్పడింది. ఇవన్నీ తెలుసుకున్న ఆరోగ్య శాఖ అధికారులకు కళ్ళు బైర్లు కమ్మినట్లు తెలిసింది. దీంతో ఆయా విషయాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేయాలనే ఆదేశాలు ఉన్నతాధికారి పేషీ నుండి రావడంతో హుటాహుటిన నిజానిజాల నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.

**కొందరు సోకాల్డ్ అధికారుల సహాయ నిరాకరణ..**

ఇవన్నీ తెలియని డైరక్టర్ తనపని తాను చేసుకుంటూ నిమ్స్ ప్రతిష్టను ఇనుమడింప చేస్తున్నా ఆయన నాయకత్వంలో పని చేస్తున్న కొందరు ఉద్యోగుల సహాయ నిరాకరణ కారణంగా నిమ్స్‌పై తరచుగా అంటే దాదాపుగా ప్రతి రోజూ ఏదో ఒక విష ప్రచారం జరుగుతూనే ఉంది. అవినీతి చేసి సొమ్ము చేసుకునేది కొందరు..పేరు మాత్రం పేద రోగులకు దేవాలయం లాంటి నిమ్స్‌కు వస్తున్నదని నిమ్స్‌లో పనిచేసే సీనియర్ ఉద్యోగి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే నిమ్స్‌కు మంచిపేరు వస్తే డైరక్టర్‌కు వస్తుందని కొంతమంది బడా ఉద్యోగులే వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎందుకంటే నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా డైరక్టర్ వారికి హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంటారు. అధికారులు నిమ్స్ పూర్తిస్థాయి నివేదిక తయారు చేయడంతో పాటు అవినీతి చేస్తున్న అధికారులను ఏరివేయాలనే విషయాన్ని కూడా స్పష్టంగా అందులో పొందుపరుస్తున్నట్లు సమాచారం. ఎవరెవరు ఏ స్థాయిలో నిమ్స్‌కు చెడ్డపేరు తెస్తున్నారో కూడా కూలంకుషంగా వివరాలు సేకరించి వారిని స్థానభ్రంశం చేయాలనే ఆలోచన కూడా చేస్తున్నట్లు విశ్వసనీయసమాచారం...

**దేశం గర్వించదగ్గ వైద్యులు..**

నిమ్స్ ఆసుపత్రిలో దేశం గర్వించదగ్గ దైద్యులు ఎందరో సేవాధృక్పథంతో ఇక్కడ పనిచేస్తున్నారు. ఎన్నో క్లిష్టమైన కేసులను కూడా విజయవంతంగా పూర్తిచేసి వేలాది పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న సందర్భాలు ఇక్కడ ప్రతిరోజూ జరుగుతుంటుంది. ఒక రోగి విపత్కర పరిస్థితుల్లో నిమ్స్‌కు వస్తే ఆ రోగి బ్రతికే వరకు డైరక్టర్ కానీ వైద్యులు కానీ అహరహం శ్రమించి ఎందరికో మరో జీవితాన్ని ప్రసాదించిన సందర్భాలు కోకొల్లలు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన నిమ్స్ దేవాలయంలో కొందరు అవినీతి కారణంగా నీలినీడలు కమ్ముకుంటున్నాయని నిమ్స్‌లో పనిచేసే ప్రతి ఉద్యోగిలో ఆవేదన ఉంది. కానీ వారిని నియంత్రించే వారు కరువవడంతో తరచుగా నిమ్స్‌పై విషపు వాసనలు వస్తుండడంతో నిజాయితీగా పనిచేసేవారు తీవ్ర మనోవ్యధకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వాస్తవాలు గ్రహించడంతో కొంతమేర అయినా నిమ్స్‌కు పట్టిన చీడ వదిలిపోతుందని పలువురు ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయి నివేదికను తయారు చేసి త్వరలోనే ముఖ్యమంత్రి కార్యాలయానికి అందజేయనున్నట్లు సమాచారం.

# పాతభవనాలపై" బల్దియా "ఫోకస్

-టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో సర్వేకు కమిషనర్ ఆదేశం

-శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించి నోటీసుల జారీ

-ఓల్డ్‌బిల్డింగ్‌లపై నిర్మాణం చేపడితే చర్యలు తప్పవని హెచ్చరికలు



**హైదరాబాద్,మే 8,ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లో చారిత్రక కట్టడాలు ఎన్ని ఉన్నాయో ...శిథిలావస్థలో చేరిన భవనాలు కూడా అన్నే ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఏదోఒక చోట శిథిలా భవనాలు కూలిపోవడం ..ప్రాణనష్టం జరగడం సంభవిస్తుంది. అలాగే వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంది. ఈక్రమంలో శిథిలావస్థలో చేరి బిల్డింగుల విషయంలో కఠినంగా వ్యహరించాలని జిహెచ్‌ఎంసి నిర్ణయించింది. నగరంలో ఇలాంటి భవనాలు ఎన్ని ఉన్నాయో సర్వే చేపట్టాలని కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించగా.. డిప్యూటీ సిటీప్లానర్లు, అసిస్టెంట్ సిటీప్లానర్లు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. శిథిలావస్థలో గల ప్రభుత్వ పాఠశాల భవనాలు గుర్తిస్తే, తక్షణమే విద్యా శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. గుర్తించిన శిథిలావస్థ భవనాలకు నోటీసులు జారీ చేయాలని, అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాలను తక్షణమే ఖాళీ చేయించడం లేదా సీల్ వేయాలని, భవనాల చుట్టూ బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. భవన యజమానులు మరమ్మత్తులు చేపడితే, అవి జీహెచ్‌ఎంసి ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని, శిథిల భవనాల కూల్చివేతకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ప్రతి భవనం వివరాలను గూగుల్ స్ప్రెడ్ షీట్‌లో అప్‌డేట్ చేయాలని, నివేదికను జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. దీంతో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సెల్లార్లను , పాతబవనాలపై కొత్త నిర్మాణాలు చేపట్టే వారిని సర్కిళ్ల వారీగా నోటీసులు ఇవ్వనున్నారు. అయితే వాస్తవానికి వర్షాకాలం విపత్తు నివారణలో భాగంగా శిథిల భవనాలను గుర్తించడం, పాతభవనాలు పటిష్టత ,భద్రతపై ఇంజనీరింగ్ విభాగాల అభి ప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, అత్యంత ప్రమాదకర కట్టడాలను కూల్చివేసేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగం సర్వే చేయాలి. ఈడ్రైవ్‌లో భాగంగా పురాతన భవనాలపై జోన్లవారీగా సర్వేచేసి సంబంధిత భవన నాణ్యతపై పరిశీలించి వారికి నోటీసులు ఇవ్వడమే కాకుండా వాటిని కూల్చివేడయం వంటివి చేయాలి. కానీ ఇప్పటివరకు అలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. గతేడాది లెక్కల ప్రకారం జిహెచ్‌ఎంసి పరిధిలో 620 శిథిల భవనాలు ఉన్నాయి. ఎల్బీనగర్ 113,చార్మినార్ 89, ఖైరతాబాద్ 109, సికింద్రాబాద్ 155, శేరిలింగంపల్లిలో 62,కూకట్‌పల్లిలో 92 శిథిల భవనాలు ఉండగా..ఇప్పటివరకు వాటి పరిస్థితి ఎంటో ఉన్నతాధికారులు తెలీయదు. గతేడాది లాగే ఈసారి కూడా శిథిలభవనాలు విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# రాజీవ్ పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి



వై జంక్షన్‌లో వినూత్న ప్రదర్శన నిర్వహిస్తున్న కార్యకర్తలు.

**హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ కీలకం చేయడం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు హిమాయత్‌నగర్‌లో వినూత్నంగా నిరసన చేపట్టారు. నిరసనలో కార్యకర్తలు చెవిలో పువ్వు, చేతిలో చిప్పపట్టుకుని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రి, కె.ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పిస్తామని రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించిందన్నారు. దీంతో 16.25 లక్షల మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారని, అనంతరం కొత్తగా సిబిల్ స్కోర్ తప్పకుండా ఉండలనే నిబంధన చేయడంతో లక్షలాది మంది యువత ఈ పథకానికి దూరం అయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిబిల్ సోర్క్ ఆలోచనను విరమించుకుని యువతకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఔటర్ రింగ్ రోడ్డు పై కారు బీభత్సం..ఒకరు మృతి



**అత్తాపూర్ మే8,ప్రభాతవార్త :**
ఔటర్ రింగ్ రోడ్డుపై ఓ కారు బీభత్సవం సృష్టించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీసులు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... హిమాయత్ సాగర్ ఓఆర్ఆర్ వద్ద బ్రేక్ డౌన్ అయిన రికవరీ వ్యాన్ కారు టైర్‌ను డ్రైవర్ మారుస్తుండగా టయోటో కారు ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ శివ కేశవ గాలిలో ఎగిరిపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరోకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# చిక్కడపల్లి మెట్రోస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

## -చేతిలో క్రిమిసంహారక బాటిల్

**చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త:**
ఒక వ్యక్తి చిక్కడపల్లి మెట్రోస్టేషన్ సమీపంలో మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గుర్తు తెలియని 24 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి చిక్కడపల్లి మెట్రోస్టేషన్‌లోకి ప్రవేశించిన అనంతరం ఒక్కసారి అతడు తీవ్ర వాంతులు చేసుకుంటున్నాడు. అప్పటి అతడి చేతిలో క్రిమిసంహార మందుతో కూడిన ప్లాస్టిక్ బాటిల్ ఉంది. అతడు క్రిమిసంహార మందు తాగి వాంతులు చేసుకున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఆపస్మారకస్థితిలో ఉన్న అతడిని మెట్రో స్టేషన్ సిబ్బంది 108 అంబులెన్స్ సిబ్బందికి, చిక్కడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మెట్రో స్టేషన్ సిబ్బంది వైద్య అత్యవసర పరిస్థితి కోసం గాంధీ ఆసుపత్రికి వ్యక్తిని తరలిస్తుండగా అతడు అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు ధృవీకరించారు. చిక్కడపల్లి పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# స్వామినాథన్ కమిషన్ ప్రకారం కనీస మద్దతు ధరలు నిర్ణయించాలి

-అఖిల భారత ఐక్య రైతు సంఘం నేతల డిమాండ్



ధర్నాలో అభివాదం చేస్తున్న అఖిల భారత ఐక్యరైతు సంఘం నాయకులు

**ధర్నాచౌక్, మే 8, ప్రభాతవార్త:**
స్వామినాథన్ కమీషన్‌ను అనుసరించి, రైతు పండించిన పంటలన్నింటికీ కనీస మద్దతు ధరలు నిర్ణయించి, కేంద్ర చట్టం చేయాలని ఏఐయూకేఎస్ నేతలు డిమాండ్ చేశారు. గురువారం ధర్నాచౌక్‌లో ఏఐయూకేఎస్ కేంద్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ ఆర్థిక నిపుణులు డి.పాపారావు మాట్లాడుతూ పాలకుల తప్పుడు విధానాల వల్లనే వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని, రైతు అనుకూల విధానాలు అనుసరించకపోతే దేశానికే ఆహార భద్రత ఉండదని హెచ్చరించారు. ధర్నాకు అధ్యక్షత వహించిన ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ కనీస మద్దతు ధరలు ఇష్టం వచ్చినట్లు పాలకులు నిర్ణయించటం వల్ల రైతుల నష్టపోతున్నారని, స్వామినాథన్ సిఫారసుల ప్రకారం సమగ్ర ఖర్చుల మీద 50శాతం లాభం కలిపి ధరలు నిర్ణయిస్తే రైతు ఆదాయాలు పెరుగుతాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, రైతుల ఆత్మహత్యలు ఆగుతాయని అన్నారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం 2006ను చిత్తశుద్ధితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయటం లేదని, సాగుదారులకు పట్టాలు ఇవ్వటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చట్ట ప్రకారం సాగులో ఉన్న గిరిజన, గిరిజనేతర ప్రజలందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకార్యక్రమంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు డి.రాము, నంది రామయ్య, చిన్న చంద్రన్న, లక్ష్మన్న, బి.దేవారాం, ఎస్.సురేష్, యాదగిరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# చిన్నపాటి నిర్లక్ష్యం..ఘోర ప్రమాదం

- నగరంలో రోజుకు సగటున ఇరవై ప్రమాదాలు
- రోడ్డెక్కితే అప్రమత్తత చాలా ముఖ్యం



**హైదరాబాద్, మే8, ప్రభాతవార్త:**
నగరంలో ఎక్కడ చూసిన చిన్న,పెద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బైక్‌లు, కార్లు, పెద్ద వాహనాలు సైతం చిన్నపాటి నిర్లక్ష్యం..పొరబాట్లతో ప్రాణాలను అర్ధాంతరంగా తీసుకుంటున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోజుకు సగటున ఇరవై ఘటనలు ఉంటున్నాయని రికార్డులు చెబుతున్నాయి. అర్ధరాత్రి జరిగేవి అధికంగా సంభవిస్తున్నాయి. రోడ్లు నిర్మానుష్యంగా ఉండడంతో వేగంపెంచి అదుపు తప్పుతున్నాయని పోలీసుల దర్యాప్తులో వెలుగుచూస్తున్నాయి. ఆదొక్కటే కాదూ..ఎన్నో బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రాఫిక్ హెచ్చరిక సంకేతాలు, వేగాన్ని తగ్గించే స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడం, లోతైన గుంతలు, ఎత్తైన మ్యాన్‌హోళ్లు, రాత్రివేళల్లో వెలుతురు మస్కబారడం ఇలా ఎన్నో సమస్యలు సైతం ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీన్ని నివారించేందుకు సరైన ప్రణాళికలు రూపొందించలేరా? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఏళ్లనుంచి అరికడుదామనే మాట లేతప్పా.. ఆచరణ లేకుండా పోయింది. తాజాగా ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదానికి వేగమే ప్రధాన కారణమని తెలుస్తోంది.

**వేగాన్ని తగ్గించాలి..గుంతలను పూడ్చాలి...**

నగర రోడ్లపై ఎక్కడ చూసిన లోతైన గుంతలే దర్శనమిస్తున్నాయి. ఎత్తుగా మ్యాన్‌హోళ్లు ఉంటున్నాయి. దీంతో వాహనదారులు ముందున్న వాటిని చూడకుండా ఆదమరిచి వెళ్లడంతోనే బైక్‌లు జంప్ అయి కిందపడి ప్రమాదానికి గురవుతున్నారు. అదేవిధంగా రాత్రివేళల్లో మాస్కబారిన స్ట్రీట్‌లైట్ వెలుతురులతో రోడ్డు కనిపించకుండా ఉండడం ఒక ఎత్తైతే...వేగాన్ని అదుపు చేయకపోవడంతో స్కిడ్ అయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ రోడ్లు పునరుద్ధరించకపోవడం, ఎప్పుడు పడితే తవ్వకాలు జరపడంతో గుంతలుగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించే క్రమంలో రోడ్డుపై పడిపోతున్నారు. వ్యాపార సమస్యలు, పనిభారం, ఉద్యోగం ఒత్తిడితో రోడ్లపై ధ్యాసలేకుండా బైక్‌లు నడుపుతుండడంతో చిన్నపాటి గుంత కూడా ప్రాణాల్ని హరించివేస్తుంది. ఇటీవల తార్నకలో రోడ్డు గుంతతో కిందపడి తీవ్ర గాయలయ్యాయి. సోమాజిగూడలో మ్యాన్‌హోల్ ఎత్తుపై వెళ్లడంతో బైక్ జంప్ అయి రక్తస్రావమైంది. ఇక యువత బండి చేతుల్లో ఉంటే వేగమే తెలియకుండాపోతుంది. రయ్యిమంటూ దూసుకవెళ్తూ అదుపుతప్పుతున్నారు. రాత్రివేళల్లో వేగమే ఎన్నో ప్రమాదాలకు దారి తీస్తున్నాయని పోలీసులు వెల్లడిస్తున్నారు.

**రోడ్డెక్కితే ప్రయాణమే ధ్యాస...**

ఇంటి నుంచి బైక్, కార్లు, ఇతర వాహనాలతో రోడ్డెక్కితే ప్రయాణాలే ధ్యాసగా ఉండాలని పోలీసులు, సామాజికవేత్తలు సూచిస్తున్నారు. కుటుంబం, భార్యపిల్లలు గుర్తుచేసుకొని రాకపోకలు సాగించాలని చెబుతున్నారు. ఉత్సాహం ఉరకలేసిన రోడ్లను చూసి పరిమితి వేగమే ముఖ్యంగా గమ్యాలను చేరుకోవాలి. దీంతో ముందున్న గుంతలు, ఎత్తుపల్లాలు కనిపించడమే కాకుండా బ్రేక్ వేయగానే ఎలాంటి సమస్యలు లేకుండా నెమ్మదిగా వాహనం ఆగే అవకాశం ఉంటుంది. అదేవిధంగా మన భద్రతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలపై ఓ కన్నేసి ఉంచాలని, వారి ర్యాష్ డ్రైవింగ్‌ను గమనిస్తూ ముందుకు సాగాలని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో వారి ప్రయాణాలు తెలుసుకోవడంతో మరింత అప్రమత్తంగా ఉండే ఆస్కారం ఉంటుంది. దీంతో ప్రమాదాలు సాధ్యమైనంత మేరకు తగ్గే అవకాశం ఉంటుందని వెల్లడిస్తున్నారు.

## 11న నారాయణంచే 377వ అష్టావధానం

**-విశ్రాంత తెలుగు పండితులు భువనగిరి పురుషోత్తం**

**ముషీరాబాద్, మే 8, ప్రభాతవార్త:** ఈనెల 11వ తేదీ అవధాన కళాతపస్వి, అవధాన కౌముది, శతావధాని శ్రీమాన్ నారాయణం బాల సుబ్రహ్మణ్యంచే 377వ అష్టావధానం నిర్వహించనున్నట్లు విశ్రాంత తెలుగు పండుతులు భువనగిరి పురుషోత్తం తెలియచేశారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మియాపూర్‌లోని బొల్లారం రోడ్డులో ఉన్న శిల్పాస్ ఆర్ వి ధర్మిష్ట క్లబ్‌హౌస్ నందు ఈనెల 11, ఆదివారం సాయంత్రం 4.30 నిమిషాల నుండి అష్టావధాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త పనకంటి నరహరిరావు అధ్యక్షులుగా, చిత్రకవి చింతా రామకృష్ణారావు సంచాలకత్వం లో జరిగే ఈ అవధాన కార్యక్రమంకు తెలంగాణ గురుకుల విద్యాల యాల సంస్థ ఉపకార్యదర్శి చివుకుల శ్రీనివాస ప్రసాద్ ముఖ్యఅతిధిగా హాజరవుతారని, గౌరవ అతిధులుగా సంస్కృత ఆంధ్ర భాషా పండి తులు, విశ్రాంత ప్రాచార్యులు పురాణం రాజేశ్వరశర్మ, దుర్భా కౌండిన్య సాయి, పద్యకవి నూతలపాటి వెంకటరత్నశర్మ పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అవధానంలో ప్రాశ్నికులుగా కవి పండితులు డివిజిపి సోమయాజులు, ఏ.ఎస్.ఎన్.రెడ్డి, మాచవోలు శ్రీధర్‌రావు, క్రొవ్విడి వెంకటరాజారావు, వి.వి.సత్యప్రసాద్, క్రోసూరి శ్రీనివాస రావు, ముద్దు రాజయ్య, ధనికొండ రవిప్రసాద్ పాల్గొంటారని వివరించారు. సాహితీ అభిమానులు అందరూ ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయవలసినది కోరారు.

### కష్టపడి పార్టీలో పనిచేసే వారికే గుర్తింపు : ఎమ్మెల్యే శ్రీగణేష్



2వ వార్డు కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకుంటున్న కాంగ్రెస్ నేత శ్యామ్ సన్ రాజు

**కంటోన్మెంట్,మే 8 ప్రభాతవార్త:** కాంగ్రెసస్ పార్టీలో కష్టపడి పనిచేస్తున్న వారికే ప్రాధాన్యత ఇస్తూ పదవులు కట్ట బెడుతున్నామని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. 2వ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు వార్డు అధ్యక్ష పదవి కోసం గురువారం తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే శ్రీగణేష్ నివాసంలో శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి 2వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు శ్యామ్ సనత్ రాజు, నరేశ్, నయింహుద్దీన్‌లు వేర్వేర్‌గా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం సంవత్సరాల తరబడి జెండాలు మోసిన కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. వ్యక్తిగత విబేదాలు పక్కన పెట్టిన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో 2వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు శ్యామ్ సన్ రాజు, నరేశ్, నయీం తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : బానుక నర్మధ



2వ వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కంటోన్మెంట్ బోర్డు మెంబర్ బానుక నర్మధ తదితరులు

**కంటోన్మెంట్,మే 8 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. గురువారం 2వ వార్డులోని పైగా కాలనీ, అవంతి కాలనీ ప్రాంతాలో ఉన్న ఓపెన్ నాలాలను, పాడైన బోర్‌వెల్స్‌ను ఆమె పర్యవేక్షించారు. అదే విధంగా రేషన్ షాపుల్లో నిరుపేదలకు అందజేస్తున్న సన్న బియ్యం నాణ్యతను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బానుక నర్మధ మాట్లాడుతూ బాలంరాయి పంప్‌హౌజ్ నుంచి పైగా కాలనీ వరకు ఉన్న పైప్‌లైన్ ద్వారా సరఫరా అవుతున్న మంచినీటి సౌకర్యాన్ని మెరుగుపర్చాలని ఆమె దృష్టికి తెచ్చారు. రూ.18 లక్షల వ్యయంతో బోర్డు నిధులతో 2 మంచినీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేసి మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు బిజెపి అధ్యక్షుడు మందుల శ్రావన్, మాజీ అధ్యక్షుడు మాదారపు అశోక్, నాయకులు,శ్రీశైలం, చిట్టిబాబు, రాజశేఖర్, ముఖేశ్, మహేశ్, అనీల్, పరశరామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఉండాలి : సిఐ శ్రీకాంత్ రెడ్డి



తుకారాంగేట్ సిఐ శ్రీకాంత్ రెడ్డిని సత్కరిస్తున్న అడ్డగుట్ట ఎమ్మార్పీఎస్ నేతలు

**అడ్డగుట్ట,మే 8 ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల అదుపుకు ప్రజల సహకారం ఎల్లప్పుడు ఉండాలని తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు, అరుంధతి సేవా సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకం గా సిఐ శ్రీకాంత్ రెడ్డి, డిఐ శ్రీనివాస్‌లను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట మాజీ కార్పొరేటర్ విజయ కుమారి, ఎమ్మార్పీఎస్ నాయకులు గౌతమ్, మల్లేశ్, శివశంకర్, నాగ భూషణం, పొన్నాల రాజు, బండ నర్సింగ్ తదితరులు కలిసి నూతన పోలీస్ అధికారులకు అభినందనలు తెలియజేశారు.

### అనాధ పిల్లలు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి : కొంతం దీపిక



ఆశ్రయ్ రేయింబో హోమ్స్‌ను సందర్శించి కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

**అడ్డగుట్ట,మే 8 ప్రభాతవార్త:** తల్లిదండ్రులను కోల్పోయని అనాధ పిల్లలను హక్కున చేర్చుకొని వారికి అశ్రయం కల్పించిన రేయింబో ఆశ్రయం సంస్థను మోండా డివిజన్ కార్పొరేటర్ అభినందించారు. గురువారం ఆమె రెజిమెంటల్ బజార్‌లోని హిల్‌క్రస్టిట్ హై స్కూల్‌లో ప్రాంగణంలో ఆశ్రయ్ రేయింబో హోమ్స్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాధ పిల్లలకు ఉచిత వసతి గృహం,విద్యను అందించేందుకు ముందుకు వచ్చిన రేయింబో సంస్థ నిర్వాహకులు గ్రేస్ మణిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సౌజన్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషను బతికించుకోవడానికి అందరూ కలిసి రావాలి

**-తెలుగు భాషపరిక్షణపై రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలి**

**-గానసభలో ఉభయ తెలుగు రాష్ట్రాల సాహిత్య సదస్సు...**

**-హాజరైన డాక్టర్ నందిని సిధారెడ్డి, ప్రొఫెసర్ ఖాసిం, ప్రొఫెసర్ టి.పురుషోత్తమ్, కవులు, సాహితీవేత్తలు, మేధావులు**




సభలో పాల్గొన్న డాక్టర్ నందిని సిధారెడ్డి, ప్రొఫెసర్ ఖాసిం, ప్రొఫెసర్ టి.పురుషోత్తమ్, కవులు, సాహితీవేత్తలు, మేధావులు

**చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త:** భాష, సాహిత్యం, సంస్కృతి మూడు భాగాలుగా తెలుగు భాషను అర్థం చేసుకోవాలని, తెలుగు బతకాలంటే బాషా బ్రతకాలని, తెలుగు బ్రతకాలంటే సాహిత్యం బ్రతకాలని, తెలుగు బ్రతకాలంటే సంస్కృతి కూడా బ్రతకాల్సిన అవసరం ఉందని "తెలుగు భాషకు పట్టాభిషేకం" పేరుతో ఉభయ తెలుగు రాష్ట్రాల సాహిత్య సదస్సు పేర్కొంది. బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ, నక్క వెంకటేష్ యాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషనల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, తెలుగు బాష చైతన్య సమితి అధినేత బడేసాబ్, లక్ష్య సాధన ఫౌండేషన్ 12వ వార్షికోత్సవ సభను పురస్కరించుకుని నిర్వాహక సంస్థ అధినేత బడేసాబ్ , రామకృష్ణ చంద్రమోళి, నక్క శ్రీనివాస్ యాదవ్, ప్రజ్ఞా యాదవ్ ఆధ్వర్యంలో తెలుగు బాషా సాహిత్య సదస్సు, కవి సమ్మేళనం జరిగింది. ఆచార్య నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషను నిర్మూలించడానికి వివిధ వేదికలపై అనేక విధాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఒక వైపు హిందీని తీసుకురావడం, ఇంకో సంస్కృతాన్ని తీసుకురావడం జరుగుతున్నప్పుడు తెలుగు భాషాభిమానులుగా తెలుగు బాషా సజీవంగా, ప్రజల భాషగా నిరంతరం వెలుగుతూ ఉండాలనేదే మనందరి ఆశ అని అన్నారు. తెలుగు భాషను ప్రధమ భాషగా పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు మొదటి భాషగా తెలుగును చేర్చాలని, తెలుగు మాధ్యమంగా చదువుకున్న వారికీ ఉద్యోయోగాలకు వచ్చేసరికి వారందరికీ వైటేజ్ ఇవ్వాలని అన్నారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఇటికాల పురుషోత్త మాట్లాడుతూ డిగ్రీ లో బిఎ తెలుగు కోర్స్ పెట్టినట్టుగా తెలిపారు. సదస్సులో అనేకమంది భాషాభిమానులు ఉపాధ్యాయులు కవులు పాల్గొని తెలుగు భాషాభివృద్ధికి తెలుగు భాషా పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలు చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, ఎప్పుడు మూలకొనకపోతే ఈ బాష రానున్న కాలంలో అతిపెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని అన్నారు. బుద్ధజీవులు అంతా రాయగలిగేవారు, సమాజంలో ప్రభావితం చేయగలిగే వాళ్ళు , ప్రభావితం చేయగలిగే వారి మాటకు విలువ ఉంటుందని, ఈ విలువ ఆధారంగా రాష్ట్ర మంత్రివర్గం సహా, ఎంమ్మెల్యే , ఎంపీలను ముఖ్యమంత్రుల ను ప్రభావితం చేసే అవకాశం ఉందని, కాబట్టి భాషను రక్షిన్నుకోవడానికి ప్రజా ఉద్యమంగా తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే కాలంలో తెలుగు బాష పట్ల మక్కువ కలిగిన రచయితలు, కవులతో ఎల్బీ స్టేడియంలో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికి పూనుకోవాలని, ఇది చేస్తే కనుక 2028 ఎన్నికల మేనిఫెస్టో లో తెలుగు భాషను పరిరక్షిస్తామని ఎజెండా గా చేరుతుందని అన్నారు. భాషను రక్షించుకుంటే సంస్కృతి, జీవితం రక్షించబడుతుందని అన్నారు. అమ్మ వోడి లాంటి అక్షరాన్ని రక్షించుకోవడం మన బాధ్యత, ఆ బాషా ద్వారా ఉపాధి పొందిన వాళ్ళం కనుక, ఆ బాషతో కవిత్వాలను రాస్తున్నవాళ్ళం, మనందరి బాధ్యతగా ముందుకు తీలుసుకువెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మాణాలను ఆమోదించారు. ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులను నియమించాలి. డిగ్రీ వరకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా చేస్తూ ప్రథమభాషగా బోధించాలి. రాష్ట్రంలోని సిబిఎస్ఈ వంటి ఇతర అన్ని బోర్డుల్లో తప్పనిసరి తెలుగు ఖచ్చితంగా అమలుచేయాలి. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాలలోని జూనియర్ కళాశాలల్లో, డిగ్రీ కళాశాలల్లో ఖచ్చితంగా తెలుగు అధ్యాపకులు, తెలుగు సెక్షన్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రైవేటు యాజమాన్యాలు తమ కళాశాలల్లో తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి. విశ్వవిద్యాలయ స్థాయి (పీజీ) తెలుగు బోధనలో ఉపాధి ఆధారిత విద్యాబోధన జరగాలి. తదనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన జరగాలి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అన్ని పరీక్షల్లో తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రూప్1 లో ఇంగ్లీష్ వలె తెలుగు కూడా క్వాలిఫైయింగ్ సబ్జెక్ట్ గా ఉండాలి. జనరల్ స్టడీస్ లో కనీసం 20 శాతం ప్రశ్నలు తెలుగుకు కేటాయించాలి. తెలుగు మీడియంలో పరీక్షలు రాసే విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వాలి. ఎంబిబిఎస్, బి.టెక్ వంటి కోర్సుల్లో తెలుగును మైనర్ సబ్జెక్ట్ గా ప్రవేశపెట్టాలి. రాష్ట్రంలో పనిచేస్తోన్న ఇతర రాష్ట్రాలవారు తప్పనిసరిగా తెలుగు నేర్చుకునేలా చర్యలు తీసుకోవాలి తీర్మానించాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య పిల్లలమట్టి రాములు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఓరియంటల్ కళాశాల డీన్ డాక్టర్ రాజారత్నం, చంద్రప్రకాష్ రెడ్డి, డాక్టర్ ఎడ్ల కల్లేష్, నాలేశ్వరం శంకరం డాక్టర్ ఎన్ బాలా చారి, డాక్టర్ బి జయరాములు, డాక్టర్ జయప్రకాశ్, డాక్టర్ మల్లికార్జున్, జగన్, డాక్టర్ రాధా కుసుమ, మానస ఆర్ట్స్ థియేటర్స్ అధినేత రఘుశ్రీ, డాక్టర్ జయప్రకాష్, ఆవ మల్లయ్య, డాక్టర్ మల్లికార్జున్, చౌడూరినరసింహ రావు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం

**చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త:**



అశోక్‌నగర్ సత్యనారాయణ స్వామి దేవాలయం ఆవరణలో కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం

భక్తులు తిలకిస్తుండగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గురువారం శ్రీ సత్యనారాయణస్వామి వారి కల్యాణోత్సవం వేడుక గురువారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. అశోక్‌నగర్ శ్రీశృంగేరి జగద్గురు మహాసంస్థానము రమాసహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయం ఫౌండర్ ట్రస్టీ పల్లెంపాటి వెంకటేశ్వర్లు తనయుడు పల్లెంపాటి వీరయ్య, ఆలయం ధర్మాధికారి నేతృత్వంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జగదునగరు శంకరాచార్య దక్షిణామ్నాయ శారదాపీఠేశ్వర అనంత, భారతీతీర్థమహాస్వామి, విధుశేఖర భారతీతీర్థసాన్వమివారి ఆశీర్వ అనుగ్రహంతో ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉదయం సేవాకాలము తిరుప్పావై, విశేషపూజ, నిత్యహోమాదిక బలిహరణములు, నీరాజన, మంత్రపుష్ప అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. అనంతరం శ్రీవిష్ణుసహస్రనామపారాయణము వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం కల్యాణక్రతువు కార్యక్రమం జరిగింది. వేదపండితులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఎదురుకోలు సన్నాహము అనంతరం, శ్రీవారి కల్యాణమహోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. కాగా 9న సేవాకాలము తిరుప్పావై, హోమాదికాలు, బలిహరణ, శ్రీవారి రథోత్సవం, గ్రామోత్సవం(ఊరేగింపు), అవబృంధస్నానములు వసంతోత్సవములు, పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం, విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణము, ధ్వజారహణము, ద్వాదశ ప్రదక్షిణలు, చతుర్వేద పారాయణ పండిత సత్కారం, యాజమాన ఆశీర్వచనము, నీరాజన మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ శ్రీపుష్పయాగోత్సవము(పవళింపుసేవ), ఉత్సవపరిసమాప్తి అవుతాయన్నారు.

### అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

**వివేకానంద నగర్ కాలనీ, మే 8, ప్రభాతవార్త:** వివేకానంద నగర్ కాలనీ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్న నగర్, మెడికల్ సొసైటీ, కుమ్మరి బస్తి కాలనీలలో 35 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు గురువారం పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధి కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, ఇక్కడ ఉన్న సమస్యను పరిగణలోకి తీసుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నాణ్యత ప్రాణాలతో చేపట్టి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, జలమండలి అధికారులు ప్రియాంక, ఝాన్సీ, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, వెంకటేష్ గౌడ్, చంద్రశేఖర్, రమణరెడ్డి, ఆంజనేయులు, జగదీష్ గౌడ్, రాఘవులు, మోహన్ రావు, సత్యనారాయణ, విద్యాసాగర్, వెంకటేశ్వరరావు, రామ్ చందర్, శ్యామ్ రావు, బాబు, రమేష్ రావు, రాజు, సోమేష్, సుబ్బారావు, బండప్ప, కనకయ్య, యాదయ్య, కుమార్, మాధవి రెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

### 10 నుంచి ప్రముఖ నర్తకి కోకా విజయలక్ష్మి బృందం మలేషియా పర్యటన



ప్రముఖ నర్తకి కోకా విజయలక్ష్మి ృ బృందం

**చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త:** మలేషియా తెలుగు అసోసియేషన్ వారు మలేషియా లోని రవాంగ్ నగరం లో నిర్వహించే "ఉగాది" ఉత్సవాలలో పాల్గొనెందుకు నగరానికి చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి కోకా విజయలక్ష్మి కి ఆహ్వానం అందింది. కోకా విజయలక్ష్మి గురువారం పత్రికా ప్రతినిధులతో ఈ విషయం మాట్లాడుతూ, తమ పర్యటన వివరాలను తెలియజేసారు.తన బృందమ్ లోని సభ్యులు రవి కూచిపూడి, మధుమతి కులకర్ణి, డి. కీర్తన, కె. నిఖిల, పి. సాయి నీహారిక, కె. విశిష్ట లతో కూడిన ఎడుగురితో కలిసి మలేషియాలో మే 10 నుంచి నాలుగు రోజులపాటు పర్యటించి నృత్యప్రదర్శన లను ఇవ్వనున్నామని తెలియజేసారు.ఈ ఉత్సవాలలో భాగంగా కూచిపూడి శైలి లో ఒక నృత్య రూపకాన్ని, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ప్రత్యేక అంశాలను ప్రదర్శించనున్నట్లు విజయలక్ష్మి ృ వివరించారు.

### కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి నిరంతరం కృషి : బానుక నర్మధ

**కంటోన్మెంట్,మే 8 ప్రభాతవార్త:**

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని బోర్డు మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. బోర్డు మెంబర్‌గా నియమితులైన సందర్భంగా ఎన్నికైన సందర్భంగా 6వ వార్డు ఇక్రీ సైట్ కాలనీ వాసులు ఘనంగా సత్కరించి కాలనీలో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రతీక్ జైన్, అజయ్, అబిలాస్, మనో్మహన్, బాణాల శ్రీనివాస్ రెడ్డి, బానుక మల్లికార్జున్, నరేందర్, కాలనీ ప్రతినిధులు చిన్నా,సోమేశ్వర్, సురేందర్‌రెడ్డి, ప్రభాకర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి సన్నిధిలో ఎమ్మెల్యే కృష్ణారావు



అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సభ్యులు

**కెపిహెచ్బి కాలనీ, మే 8 ప్రభాతవార్త:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మనవడు అన్నప్రాసన సందర్భంగా యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. అనంతరం స్వామివారి ఆశీస్సులు తీసుకున్న తర్వాత వేద పండితులు వారి కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాధవరం కృష్ణారావు దంపతులు, కుమారుడు సందీప్ రావు దంపతులు, తులసి రావు దంపతులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యం, కేంద్ర ప్రభుత్వానికి సెల్యూట్



జాతీయ జెండాలతో భారత సైన్యం, భారత ప్రభుత్వానికి సెల్యూట్ కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త:** వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ పూర్వ అధ్యక్షుడు ఆర్.వివేక్ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ ఎదుట భారత సైన్యం, భారత ప్రభుత్వానికి సెల్యూట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పూర్వ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వి.నాగభూషణం, పూర్వ అధ్యక్షులు రమేశ్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్, మురళీకృష్ణ, రవికుమార్, గోల్డ్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



# గుడిసె బతుకులు బుగ్గిపాలు

-సర్వం కోల్పోయాం ఆదుకోండి
-గుండెలు బాదుకుంటున్నా బాధితులు
-అండగా నిలుస్తామన్న బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్
-దుస్తులు ఆర్థిక సహాయం చేసిన బిజెపి, కాంగ్రెస్


బాధితులతో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్, మధు యాష్కిగౌడ్, చింతల అరుణ


అగ్నికి ఆహుతైన గుడిసెలు


రోధిస్తున్న బాధితులు

**ఎల్బీనగర్, మే 8 ప్రభాతవార్త:** గుడిసె బతుకులు బుగ్గిపాలు అయ్యాయని మమ్మల్ని ఆదుకోవాలంటూ బాధితులు గుండెలు బాదుకుంటున్నారు. మండుటెండలో గుడిసెలు అగ్నికి ఆహుతి అయి కేవలం బూడిద మాత్రమే మిగిలింది. మండుటెండలో నిలువ నీడ కోసం తాపత్రయ పడుతున్న నిరుపేద గుడిశవాసులకు గుడిసెలు కాలిపోవడంతో రోడ్డుమీద బతుకులు అయ్యాయి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ డివిజన్ సాయి నగర్‌కాలనీలోని గుడిసెలు మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా గుడిసె కాలిపోవడం అందులోని సిలిండర్ తేలడంతో సుమారు 30 గుడిసెలు అగ్నికి ఆహుతి అయ్యాయి. అగ్ని ప్రమాదం కారణంగా గుడిసెలోని టీవీలు, వంట సామాగ్రి, సర్టిఫికెట్లు, బంగారం, వెండి, నగదు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సాయి నగర్‌లో సుమారు 600 గుడిసెలు ఉండగా అందులో 30 గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. వెంటనే ఫైర్‌ఇంజన్ అధికారులు సిబ్బంది తరలివచ్చి మంటలు ఆర్పేయడంతో మిగతా వాటికి ప్రమాదం జరగకుండా ఆపగలిగారు. అయితే గత 10 సంవత్సరాల క్రితం కూడా అగ్ని ప్రమాదం జరిగి భారీఎత్తున గుడిసెలు కాలిపోయాయి. అప్పుడు కూడా పెద్దఎత్తున ఆస్తినష్టం జరిగింది. కాగా మాకు గూడు లేకుండా పోయిందని సర్వం కోల్పోయామని బాధితులు కన్నీరు మున్నేరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వపరంగా వెంటనే సహాయం అందించాలని కూడా బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

**సర్వం కోల్పోయాం...**

అగ్ని ప్రమాదంలో తాము సర్వం కోల్పోయామని బాధితులు కన్నీరు మునీరుగా విలపించారు. అగ్ని ప్రమాదంలో ఇంట్లోనే వస్తువులన్నీ ఖాళీ బూడిదగా మారాయని అన్నారు. బట్టలు, టీవీలు, వంట సామాగ్రి, సర్టిఫికెట్లు, ముఖ్యమైన వస్తువులు, బంగారం, వెండి, నగదు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయని బాధితులు విలపించారు.

**బాధితులకు అండగా నిలుస్తాం: ఎంపీ ఈటెల**

బాధితులకు తాము అండగా నిలుస్తామని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ బాధితులకు భరోసా కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగిన సాయి నగర్ గుడిసెల వద్దకు వెళ్లి వారిని ఓదార్చారు. బాధితులకు దుస్తులు వంట సామాగ్రిని వారు అందజేశారు.

**ప్రభుత్వం అండగా నిలుస్తుంది:మధుయాష్కి**

గుడిసెలు కాలిపోవడం దురదృష్టకరమని బాధితులకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ భరోసా కల్పించారు. సాయినగర్ వెళ్లిన మధుయాష్కి బాధితులను పరామర్శించి రూ.3 వేల నగదును బాధితులకు అందజేశారు. వెంటనే కలెక్టర్ ఇతర అధికారులతో మాట్లాడి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. సర్వం కోల్పోయిన బాధితులకు డబల్ బెడ్ రూమ్ ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి:ఎమ్మెల్యే**

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాధితులకు వెంటనే రూ 50 వేల నగదు ఇవ్వాలని, నష్టపరిహారం కింద రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఇండియన్ ఆర్మీకి లారీలతో ఉచిత సేవలను అందిస్తాం :నందారెడ్డి


ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న లారీ యజమానుల సంఘం

**వనస్థలిపురం. మే.8.ప్రభాతవార్త :** కాశ్మీర్ లోని పహెల్గాం లో హిందూ టూరిస్ట్‌ల పై పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాదులు దాడి చేసి 28మందిని పొట్టనపెట్టుకున్న సంఘటన కు బదులు గా భారత ప్రధాని నరేంద్రమోదీ ఆపరేషన్ సిందూర్ చేపట్టి, పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్,పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోగల తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత త్రివిధ దళాలు ఏక కాలంలో దాడులు చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టినందుకు తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు బూడిద నందారెడ్డి ఆధ్వర్యంలో హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆటో నగర్ నుండి విజయవాడ జాతీయ రహదారిపై సుష్మ థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నందారెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులను తయారు చేస్తున్న అనుమతులు లేని మదార్శ ల మీద చర్యలు తీసుకోవాలని కోరారు. పాకిస్థాన్ భారత్‌తో యుద్ధానికి దిగితే ,భారత సైన్యానికి తాము లారీలతో ఉచిత సేవలు అందిస్తామన్నారు.ఈ ర్యాలీ లో బూడిద రాంరెడ్డి, రాజు గౌడ్,వెంకన్న,కొండల్ రెడ్డి, అల్వాల్ రెడ్డి, ఆకుల శ్రీనివాస్,జగదీష్, జంగారెడ్డి,మహేష్, శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ విజయవంతంతో ర్యాలీ


జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న కాలనీవాసులు

**ఎల్బీనగర్, మే 8 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్‌పై హర్షం వ్యక్తం చేస్తూ ఆర్కేపురం డివిజన్ చిత్రాలేఔట్‌లో జాతీయ జెండాలు పట్టుకొని భారీ ప్రదర్శన నిర్వహించారు. పహ్లగాం దాడికి నిరసనగా భారత సైనికులు చేసిన దాడితో పాటు ఇకపై దేశ రక్షణ కొరకు ఏ చర్యలు తీసుకున్న భారతీయులందరూ సైనికులకు అండగా నిలుస్తామని హర్షం వ్యక్తం చేస్తూ బాణాసంచా కాల్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో ఉగ్రవాదులపై జరిగిన దాడి నేపథ్యంలో దేశ సైనికులకు, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉంటావని కాలనీ వాసులు రంగారెడ్డి జిల్లా కోర్ట్ ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు పేరాల శేఖర్జి, ,ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షులు మురళిమనోహర్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి పిట్టా ఉపేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు నగేష్, గణేష్, ఆర్ఎస్ఎస్ నాయకులు రామకృష్ణయ్య, సాయి, రఘు, సత్యనాయనరెడ్డి, కుసుమ, సబిత, రేగట్టే సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 11న ఉచిత మెగా వైద్య శిబిరం


విట్టల్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న కాలనీవాసులు

**ఎల్బీనగర్, మే 8 ప్రభాతవార్త:**

చైతన్యపురి డివిజన్ సత్యనారాయణపురం కాలనీలో ఈనెల 11వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉచిత వైద్య శిబిరానికి రావాలని కోరుతూ గురువారం చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరంలో అనుభవం గల వైద్యులు పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని కాలనీవాసులు, పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉప్పల్ రవాణా కార్యాలయంలో పేదలకు సరుకుల పంపిణీ


ఉప్పల్ ఆర్‌టిఏ కార్యాలయంలో పేదలకు వస్తువులు అందజేస్తున్న ఎంవిఐ రవీందర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 8 ప్రభాతవార్త :** పేదల కోసం సహాయం చేసే వారికి తగు సహకారం అందిస్తామని ఉప్పల్ ఎంవిఐ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ రవాణా కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు సరుకులు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రవాణా కార్యాలయంలో ప్రజలకు తమ వంతు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంవిఐ శ్రీనివాస్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## దళితరత్న అవార్డు అందుకున్న సుధీష్ కుమార్


సుధీష్ కుమార్‌కు అవార్డు అందజేస్తున్న నగరిగారి ప్రీతమ్

**సైదాబాద్, మే 8 ప్రభాతవార్త:** ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్ చేతుల మీదుగా బి.వై.సుధీష్ కుమార్ దళిత రత్న అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పత్తి కుమార్, బి.విక్షిత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెలు కాలిపోయిన పేదలకు వస్తువుల అందజేత


బాధితులకు వస్తువులు అందిస్తున్న నారాయణ.

**హయత్ నగర్, మే 8 ప్రభాతవార్త :**

అందాల పోటీలో నిమగ్నమైన రేవంత్ సర్కార్ పేదల సమస్యలను పూర్తిగా విస్మరించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం రావినారాయణ రెడ్డి కాలనీలో గత నెల 26న అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గుడిసెలను అయన గురువారం సందర్శించి భాధితులలో మనోధైర్యం నింపారు. ఆయన వినతి మేరకు స్పందించిన విజయవాడ పాపులర్ షూ మార్ట్ యాజమాన్యం నిరాశ్రయలకు దుప్పట్లు, టవళ్లు, ప్లాస్టిక్ బకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అగ్ని ప్రమాద బాధితులను స్థానిక ఎమ్మెల్యే పరామర్శించాలని, ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం కింద ఒక లక్ష రూపాయలు ఇవ్వాలన్నారు. నష్టపోయిన పేదల వైపు చూడాల్సిన భాద్యత పాలకులపై ఉందన్నారు. గుడిసెలను నిప్పు పెట్టిన ఆగంతకులను పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భూస్వాములు, కబ్జాకోరులు ఎన్ని కుట్రలు చేసినా పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు వెనక్కు తగ్గేదేలే దన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రచారి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, నాయకులు పానుగంటి పర్వతాలు, పల్లె నర్సింహా, పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్ నాయక్, కేతరాజు నర్సింహా, యాదగిరి, నవనీత పాల్గొన్నారు

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి : ప్రిన్సిపాల్ దిలీప్ రెడ్డి


పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సి పాల్ దిలీప్ రెడ్డి తదితరులు

**మలక్ పేట ,మే 8, ప్రభాతవార్త:**

విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడంతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని శ్రీ సాయి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దిలీప్ రెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ లోని శ్రీ సాయి డిగ్రీ, పీజీ కళాశాలలో స్పోర్ట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ దిలీప్ రెడ్డి బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో ఆధునాతన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించడంతోపాటు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని, పలు క్రీడలలో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టడానికి కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ, అంకుటిత దీక్షతో తమ లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాసాచార్యులు, శేఖర్ రెడ్డి, ఎల్.వెంకటేశ్వర్లు, శోభారాణి, మమత, అపర్ణ, నజీరా, షర్మిల, గౌరీ ప్రియ, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు


శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 8 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం జరిగిన శ్రీ వాసవి మాత రథోత్సవంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు కారణ జన్మురాలు, శక్తి స్వరూపిణి అని అన్నారు. రాచరికపు దౌష్ట్యాన్ని అహింసాయుతంగా దక్కిరించిన ధీర వనిత అన్నారు. విశ్వసించిన వారికి మోక్షాన్ని అందించిన అపర పార్వతిగా కొలువుదీరినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రీ వాసవి మాత మందిరాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఆర్య వైశ్య సంఘం నేతలు బిక్కుమళ్ల సుధాకర్‌గుప్త, రమేష్‌గుప్త, సంతోష్‌గుప్త, పలువురు ఆర్య వైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

## అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు, బంగ్లా దేశస్తులను వెనక్కి పంపాలని డిజిపికి వినతి


డిజిపి కార్యాలయంలో వినతి పత్రం సమర్పించిన రాఘవేందర్, హైందవి రెడ్డి

**సరూర్‌నగర్, మే 8 ప్రభాతవార్త:**

మహేశ్వరం నియోజకవర్గంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు, బంగ్లాదేశ్ ముస్లింలను తక్షణమే అదుపులోకి తీసుకొని వారి దేశాలకు తిప్పిపంపాలని రంగారెడ్డి జిల్లా బిజెవైఎం ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన బిజెపి నాయకురాలు హైందవిరెడ్డితో కలిసి డిజిపి కార్యాలయంలో ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్‌తో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ రోహింగ్యాలు, బంగ్లా ముస్లింలు అక్రమంగా నివసిస్తూ ఉండడం ఆందోళన కలిగించే పరిణామమని అన్నారు. ఈ మేరకు అక్రమ వలసదారులను నిర్దాక్షిణ్యంగా ఇక్కడి నుండి వారి స్వస్థలాలకు పంపివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి మే8,ప్రభాతవార్త :**

మల్కాజ్గిరి నియోజకవర్గంలోని బాలురు,బాలికలు ,నేరేడుమెట్ , మోలాలి, ఫ్రాబేల్స్, పాఠశాలలలో పదవ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను అధ్యాపకులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సురేష్ ప్రభుత్వ పాఠశాలలకు కరెంట్ జీరో బిల్లు వచ్చే విధంగా చూడాలని, స్థానికంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లో మౌలిక వసతులు కల్పిస్తే అక్కడి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరే అవకాశాలు ఉన్నాయని డబుల్ బెడ్ రూమ్ లకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి 500 పైగా సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేసి, ఉన్నత చదువులు అవరోధించాలని సూచించారు.ఈ యొక్క కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, ప్రభుత్వ పాఠశాలల ప్రధాన అధ్యాపకులు సురేష్, సరస్వతి, వెంకటరమణ, విజయ కుమారి, కిరణ్మయి, దమయంతి, సింధు కాలేజ్ ప్రిన్సిపల్ మల్లికార్జున్, ప్రొఫైల్స్ స్కూల్ ప్రిన్సిపల్ హిందుమతి, వినూత్న, బి ఆర్ ఎస్ నాయకులు రావుల అంజయ్య జె ఏ సి వెంకన్న, ఏకే మురుగేష్ మేకల రాము యాదవ్, రమేష్, లక్ష్మి, ఉపేందర్, బాబు, శివ కుమార్,వెంకటేష్ ,పిట్టల శీను, బాలరాజు, నర్సింగ్ రావు, ఓం రాజ్, శ్రీకాంత్, మురళి నాయుడు,సాయి గౌడ్, సుమన్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి నివాళులర్పించిన డిప్యూటీ మేయర్


రిజిరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్

**తార్నాక, మే 8 ప్రభాతవార్త :**

ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులుగా, టీటీడీ బోర్డు సభ్యులుగా, కాప్రా మున్సిపల్ చైర్మన్‌గా అనేక సేవలందించిన నాయకులు దివింగత బండారి రాజిరెడ్డి పార్టీకి చేసిన సేవలు మరువలేనివని హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి,టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి పేర్కొన్నారు. హబ్సిగూడలోని ఆయన నివాసంలో రాజిరెడ్డి పార్థివ దేహానికి వారు శ్రద్ధాంజలి అర్పించారు.డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, "రాజిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నామని ఆయన సేవలను మర్చిపోలేమన్నారు.

## తుల్జా భవానీ మాత సేవలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి


తుల్జాపూర్‌లో భవానీ మాతను దర్శించుకున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 8 ప్రభాతవార్త:** ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో సిబిఐ న్యాయస్థానం నిర్దోషిగా పేర్కొన్న నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రిగా పని చేసిన పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి కోర్టు తీర్పుపై ఊరట చెందారు. దాదాపు 15 సంవత్సరాలుగా కోర్టు కేసు నడిచిన నేపథ్యంలో ఇన్నాళ్లు చేయని తప్పుకు వేదనకు గురైన ఆమెకు ఎట్టకేలకు కోర్టు తీర్పుతో స్వాంతన చేకూరినట్లైంది. ఈ నేపథ్యంలో తన ఆరాధ్యదైవమైన మహారాష్ట్ర సోలాపూర్ సమీపంలోని తుల్జాపూర్ భవానీ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తన చిన్న కుమారుడు పట్లోళ్ళ కళ్యాణ్‌రెడ్డితో కలిసి ఆమె భవానీ ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా సబితా ఇంద్రారెడ్డికి సంఘీభావంగా తుల్జాపూర్ తరలివెళ్ళిన మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు అమ్మవారిని దర్శించుకోవడం విశేషం.

## 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలి


సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు తదితరులు

**సరూర్‌నగర్, మే 8 ప్రభాతవార్త:**

ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెను బాలాపూర్ మండలంలో విజయవంతం చేయాలని మండల సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బాలాపూర్ చౌరస్తాలో గురువారం మండల సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు పలువురు నాయకులతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పని చేస్తున్న కార్మికులందరూ ఆ రోజు విధులను బహిష్కరించి సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి నాయకులు శేఖర్ యాదవ్, యాదగిరి చారి, శివ, నరేందర్, కృష్ణలతో పాటు వెంకయ్య, దాసరి నర్సింహప, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపురి కాలనీ రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**మల్కాజిగిరి మే8,ప్రభాతవార్త :**

ప్రశాంత్ నగర్ రైల్వే క్వార్టర్స్ ఫ్రాబెల్స్ స్కూల్ నుండి శ్రీ పురి కాలనీ వరకు రోడ్లులను మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ రోడ్డు వేసేందుకు రైల్వే అధికారులకు తెలియజేస్తానని ప్రొఫెసర్ జయశంకర్ నగర్ వసంత పురి, కాలనీ వాసులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఈ మార్గం ద్వారా వెళ్లే విద్యార్థులకు ,పనులపై వెళ్లే కాలనీవాసులకు మేలు కలుగుతుందని స్థానికులు సూచించారు.ఈ కార్యక్రమంలో, సింధు కాలేజ్ ప్రిన్సిపల్ మల్లికార్జున్,బి ఆర్ ఎస్ నాయకులు రావుల అంజయ్య జె ఏ సి వెంకన్న, ఏకే మురుగేష్ మేకల రాము యాదవ్, రమేష్, లక్ష్మి, ఉపేందర్, బాబు, శివ కుమార్,వెంకటేష్ ,పిట్టల శీను, బాలరాజు,నర్సింగ్ రావు, ఓం రాజ్, శ్రీకాంత్, మురళి నాయుడు,సాయి గౌడ్, సుమన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజి రెడ్డికి నివాళులర్పించిన కార్పొరేటర్


రాజి రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న కార్పోరేటర్

**నాచారం, మే 8 ప్రభాతవార్త :**

ఉప్పల్ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు బండారి రాజా రెడ్డి గురువారం ఉదయం స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్నబారాస రాష్ట్ర నాయకులు సాయి జన్ శేకర్, ఆయన సతీమణి నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేకర్ లు బండారి రాజారెడ్డినివాసంలో వారి పార్థివ దేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సాయి జన్ శేకర్ మాట్లాడుతూ 2004 సంవత్సరంలో నేను రాజకీయాల్లోకి బండారి రాజిరెడ్డి ద్వారానే వచ్చానని గుర్తు చేశారు. బండారి రాజి రెడ్డి కాప్రా మున్సిపాలిటీ చైర్మన్‌గా ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యునిగా అలాగే టిటిడి బోర్డు మెంబర్గా వినలేని సేవలందించారని గుర్తు చేశారు.